క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి

పాలకొండ రూరల్: వర్షాకాలంలో పశువులు, గొర్రెలు, మేకలు సీజనల్ వ్యాధులు బారినపడే అవకాశం ఉందని, పాడిరైతులు, పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ప్రభా మాణిక్యరావు సూచించారు. మండలంలోని తుమరాడ, అంపిలి, భాసూరు, చినమంగళాపురం గ్రామాలకు శుక్రవారం ఆయన వెళ్లి, అక్కడి పశువైద్య కేంద్రాల్లో అందిస్తున్న సేవలపై ఆరాతీశారు. అనంతరం తొలకరి వర్షానికి నేలపై మొలిచే గడ్డిని ఆరగించడంతో వాటిపై ఉండే వైరస్, బ్యాక్టీరియాల ద్వారా మూగజీవాలు వ్యాధుల బారినపడే అవకాశం ఉందన్నారు. వ్యాధులు సోకకుండా మూగజీవాలకు ముందస్తు టీకాలు వేయించాలని తెలిపారు.

పీఏసీఎస్ అధ్యక్ష పదవికి రాజీనామా


కె.గోవిందరావు

వీరఘట్టం: మండల వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) అధ్యక్ష పదవికి కర్రి గోవిందరావు శుక్రవారం రాజీనామా చేశారు. గత ఐదేళ్లలో వీరఘట్టం పీఏసీఎస్‌ను ఎంతగానో అభివృద్ధి చేశానని, తనకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలన్నారు. అనంతరం ఆయన తన రాజీనామా పత్రాన్ని సీఈవో బూరాడ పైడిరాజుకు అందజేశారు. ఇదిలా ఉండగా, పీఏసీఎస్ డైరెక్టర్లుగా ఉన్న భోగి మణి, రంభ శ్రీనివాసరావులు కూడా తమ పదవులకు రాజీనామా చేశారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు


కాలువలోని పూడికలు తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

కురుపాం: మండలంలోని మొండెంఖల్ గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య పనులు చురుగ్గా జరుగుతున్నాయి. శుక్రవారం గ్రామ వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించడంతో పాటు కాలువల్లోని పూడికలు తీసివేశారు. అనంతరం కాలువలు, మురుగునీటి నిల్వలు ఉన్న ప్రాంతాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. గ్రామస్తులకు తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, తాగునీటి బోర్లు, బావుల్లో క్లోరినేషన్ చర్యలు చేపడుతున్నామన్నారు.

గిరిజనుల శ్రమదానం


రోడ్డుపై తేలిన రాళ్లను ఏరి బయట పడేస్తున్న గిరిజనులు

సీతంపేట: ఏజెన్సీ పరిధిలోని దిగువద్వార బందం నుంచి ఎగువ ద్వారబందం వరకు ఉన్న రోడ్డులో అక్కడి గిరిజనులు శ్రమదానం చేశారు. రోడ్డుపై తేలిన రాళ్లతో వారి రాకపోకలకు అవస్థలు కలుగుతుండడంతో శుక్రవారం ఉదయం వారంతా కలిసి శ్రమదానానికి సిద్ధమయ్యారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ తేలిఉన్న రాళ్లను తీసివేసి, రోడ్డు పక్కన వేశారు. ప్రస్తుతం రోడ్డు కాస్త చదునుగా తయారు కావడంతో కొంతవరకు రాకపోకలకు ఇబ్బంది ఉండదని వారు భావిస్తున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా తమ తలరాతలు మారడం లేదని, ఇప్పటికైనా పక్కా రోడ్డు నిర్మించి, తమ ఇబ్బందులు తొలగించాలని అధికారులను కోరుతున్నారు.

90 శాతం రాయితీపై విత్తనాల పంపిణీ


రైతులకు విత్తనాలు అందిస్తున్న కుక్కిడి ఆర్‌బీకే సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కుక్కిడి గ్రామ రైతు భరోసా కేంద్రంలో 90 శాతం రాయితీపై వరి విత్తనాలతో పాటు చిరుధాన్యాల విత్తనాలను రైతులకు శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం ఆయా విత్తనాలు ఏ విధంగా వేసుకోవాలి, అధిక దిగుబడులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వీఏఏ కె.విజయ్ వివరించారు. ఖరీఫ్ సాగుకు సంబంధించి, రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, కావాల్సిన వారు ఆర్‌బీకేలను సంప్రదించాలని కోరారు.

సంతోషిమాతకు ప్రత్యేక పూజలు


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

భామిని: మండలంలోని సంతోషిమాత ఆలయంలో అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. కాట్రగడ–బి టీడీపీ నేత కొవ్వూరు శేఖర్ ఆధ్వర్యంలో 108 కొబ్బరికాయలు కొట్టి, మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యేగా నిమ్మక జయకృష్ణను గెలిపించాలని అమ్మవారికి మొక్కుకున్నామని ఆయన తెలిపారు.

ఈదురుగాలులు.. భారీ వర్షం..

వీరఘట్టం/పాలకొండ/పాలకొండ రూరల్/సీతంపేట/గరుగుబిల్లి: మండలాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 3 గంటలకు మేఘావృతమై, ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. అనంతరం భారీ ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కొన్నిచోట్ల ఈదురుగాలుల ధాటికి చెట్ల కొమ్మలు విరిగిపోగా, మరికొన్నిచోట్ల విద్యుత్ లైన్లపై పడిన చెట్లకొమ్మల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మరో మూడురోజుల పాటు ఇదే వాతావరణం ఉంటుందని, రైతులు నారుమడులు సిద్ధం చేసుకోవాలని రైతులు సూచిస్తున్నారు. ఇన్నాళ్లు వేసవి ఎండల కారణంగా ఉక్కపోతతో అలమటించిన ప్రజలు ఈ వర్షంతో కాస్త ఉపశమనం పొందారు.


పాలకొండ రూరల్: పాలకొండ పట్టణంలో పడుతున్న వర్షం


గరుగుబిల్లి రోడ్డులో కూలిన చెట్టుకొమ్మ


వీరఘట్టం: మండల కేంద్రంలో కురుస్తున్న భారీ వర్షం

400 ఎకరాల్లో జీడిమామిడి సాగు లక్ష్యం

గుమ్మలక్ష్మీపురం: ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యాన పంటల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా మండలంలో మొత్తం 400 ఎకరాల్లో జీడిమామిడి సాగును లక్ష్యంగా చేసుకుని, రైతులను ప్రోత్సహిస్తున్నట్లు ఏపీవో శివరామకృష్ణ తెలిపారు. మండలంలోని కొత్తగూడ జీటీడబ్ల్యూఏహెచ్ స్కూల్ ఆవరణలో ఉద్యాన పంటల సాగుకు ఆసక్తి చూపిస్తున్న వంగర, కేదారిపురం, నోంద్రుకోన, రెల్ల, దుమ్మంగి, కుక్కిడి, పెదఖర్జ, తాడికొండ, ఇరిడి, లుంబేసు గ్రామ పంచాయతీల్లోని రైతులకు జీడిమామిడి సాగుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సాగుకు ఉపాధి హామీ పథకం ద్వారా అందించనున్న లబ్ధి వివరాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఇదే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త శ్రీనివాసరావు మాట్లాడుతూ జీడిమామిడి సాగులో మొక్క నుంచి పంట దిగుబడి వచ్చే వరకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. అనంతరం ఏపీవో మాట్లాడుతూ జీడిమామిడి సాగు కోసం గుంతలు తీయడం దగ్గర నుంచి మొక్కలు నాటడం, వాటికి నీరు పోయడం, కంచె ఏర్పాటు చేయడం వంటి వాటికి మూడేళ్ల పాటు ఉపాధి హామీ పథకం ద్వారా ఎకరాకు రూ.లక్ష వరకు రైతులకు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని, ఉద్యాన పంటల సాగు చేసి, ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. సమావేశంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.


కొత్తగూడలో ఉద్యాన పంటల సాగుకు సలహాలు, సూచనలిస్తున్న ఏపీవో శివరామకృష్ణ

జీవో నంబర్ 3 పునరుద్ధరణ తర్వాతే డీఎస్సీ ఇవ్వాలి

కురుపాం: జీవో నంబర్ 3 పునరుద్ధరించిన తర్వాతే డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షుడు ఆరిక చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఇదే విషయమై శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గిరిజనుల కోసం జీవో నంబర్ 3 పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జీవో అమలు చేసి, డీఎస్సీ ప్రకటిస్తేనే గిరిజన నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందన్నారు.

గుమ్మలక్ష్మీపురం: జీవో నంబర్ 3 పునరుద్ధరణ తర్వాతనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని గిరిజన సంక్షేమ సంఘం, గిరిజన నిరుద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్‌కుమార్, తాడంగి సాయికుమార్‌లు ఓ ప్రకటనలో శుక్రవారం డిమాండ్ చేశారు. జీవో పునరుద్ధరించకుండా డీఎస్సీ నిర్వహిస్తే షెడ్యూల్డ్ ఏరియాలోని గిరిజన ప్రాంతాల్లో నివశిస్తున్న గిరిజన నిరుద్యోగులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. కురుపాం, అరకు వ్యాలీ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారంలో చంద్రబాబునాయుడు జీవో నంబర్ 3ను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు.

ఎమ్మెల్యేను కలిసిన వ్యవసాయాధికారులు


ఎమ్మెల్యే జయకృష్ణకు అభినందనలు తెలుపుతున్న వ్యవసాయాధికారులు

వీరఘట్టం: పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణను ఎం.రాజపురంలోని ఆయన స్వగృహంలో మండల వ్యవసాయాధికారులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు నియోజకవర్గంలో ఖరీఫ్ సాగు లక్ష్యాలు, సిద్ధం చేసిన విత్తనాలు, ఎరువులపై చర్చించారు. అంతకుముందు వీరంతా కలిసి ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్‌తో పాటు వీరఘట్టం, పాలకొండ, సీతంపేట, భామిని, మండలాల వ్యవసాయాధికారులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

గరుగుబిల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామని ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎస్.అర్జునరావు అన్నారు. మండలంలోని పెద్దూరు, గరుగుబిల్లి, రావుపల్లి గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వీధుల్లో సంచరిస్తూ ఎక్కడా మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని గ్రామస్తులకు వైద్యారోగ్య సిబ్బంది సూచించారు. దోమల నివారణకు దోమల నివారణ మందు పిచికారీ చేయాలని సూచించారు. ముఖ్యంగా తాగునీటి బోర్లు, బావులు, రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ తప్పనిసరిగా చేయాలని ఎంపీడీవో సిబ్బందిని ఆదేశించారు. వర్షాకాలంలో మలేరియా, డెంగీ, అతిసారం వంటి సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉండొచ్చన్నారు. కార్యక్రమంలో పెద్దూరు ఉప సర్పంచ్ తెర్లి ఎర్రంనాయుడు, వైద్యారోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: మండలంలోని శివ్వాం గ్రామంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు సంతోష్‌కుమార్ శుక్రవారం పర్యటించి, సీజనల్ వ్యాధుల బారినపడకుండా గ్రామస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అంతకుముందు మెడడులో ఏర్పడిన కణితిని తొలగించే ఆపరేషన్ చేయించుకున్న చిన్నారిని వైద్యుడు కలిసి, ఆరోగ్యంపై ఆరాతీశారు. పౌష్టికాహారం తీసుకుని, మందులు సక్రమంగా వాడితే ఆరోగ్యం కుదుటపడుతుందని ధైర్యం చెప్పారు.

భామిని: మండలంలోని కోసిమానుగూడ, జియ్యమానుగూడ గ్రామాల్లో బత్తిలి పీహెచ్‌సీ వైద్యాధికారి దామోదరరావు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఇంటింటికీ వైద్యారోగ్య సిబ్బంది వెళ్లి, జ్వరపీడితులపై ఆరాతీశారు. జ్వర లక్షణాలతో బాధపడుతున్న వారి రక్తనమూనాలు సేకరించారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉందని, ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు.


పెద్దూరులో తాగునీటి బావిలో క్లోరినేషన్ చర్యలు చేపడుతున్న సిబ్బంది


భామిని: వైద్య శిబిరం వద్ద ఆరోగ్య సూచనలిస్తున్న బత్తిలి పీహెచ్‌సీ వైద్యాధికారి దామోదరరావు

న్యాయ విజ్ఞాన సదస్సు



న్యాయసేవలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి విజయ్‌రాజ్‌కుమార్

పాలకొండ రూరల్: మండలంలోని లుంబూరులో న్యాయ విజ్ఞాన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకొండ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎ.విజయ్‌రాజ్‌కుమార్..ఏయే చట్టాల ద్వారా ఏ విధమైన న్యాయసేవలు పొందవచ్చో తెలిపారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. గ్రామంలోని ఇంటింటి ద్వారా సేకరిస్తున్న తడి, పొడి చెత్త ద్వారా ఎరువులు తయారుచేసి, రాయితీపై రైతులకు అందేలా చూడాలని తెలిపారు. అనంతరం జడ్జిని గ్రామస్తులు సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తిర్లంగి ఉపేంద్రకుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.సత్యనారాయణ, కార్యదర్శి పి.మునిస్వామి, కనపాక సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు లాభదాయక విధానాలు అనుసరించాలి

పార్వతీపురంటౌన్: రైతులు లాభదాయక విధానాలు అనుసరించాలని అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వెంకట రావు అన్నారు. ఈ మేరకు మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో పార్వతీపురం మండలంలోని డోకిశీల గ్రామంలో శుక్రవారం రైతు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రైతు సంబంధిత చట్టాలపై అవగాహన పొందాలని సూచించారు. విత్తనాలు, ఎరువుల కొనుగోలు సమయంలో నాణ్యత చూడాలని, సంబంధిత బిల్లులు జాగ్రత్త చేయాలన్నారు. మోసాలకు గురైనప్పుడు చట్టాలకు అనుగుణంగా నష్టపరిహారం పొందవచ్చని చెప్పారు. రోజువారీ జీవనంలో ఎదురయ్యే అనేక సమస్యలకు చట్టపరంగా న్యాయం పొందవచ్చని, మండల న్యాయ సేవా కమిటీ న్యాయ సహాయం ఉచితంగా అందిస్తుందని, దీన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు రైతులను సత్కరించారు. లోక్ అదాలత్ కమిటీ సభ్యులు టి.జోగారావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి

- పాలకొండ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జి.నాగభూషణరావు

పాలకొండ: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆపదలో ఉన్న వారికి రక్తం దానం చేసి, వారి ప్రాణాలను కాపాడాలని పాలకొండ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జి.నాగభూషణరావు కోరారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆవరణలో రక్తదాన శిబిరం శుక్రవారం నిర్వహించారు. శిబిరానికి హాజరైన యువత రక్తం దానం చేసి, స్ఫూర్తిని కనబరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రమాదాల్లో తీవ్రగాయాలపాలై రక్తం లభించక ఎంతోమంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. మనం ఇచ్చే రక్తం ఒక వ్యక్తి ప్రాణాలు కాపాడడమే కాకుండా వారి కుటుంబాలకు పెద్ద దిక్కును మిగిల్చిన వారమవుతామన్నారు. రక్తం దానం చేస్తే అనారోగ్యపాలవుతామన్న అపోహలు వీడాలని, ప్రతిఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలన్నారు. రక్తం దానం చేస్తే మరింత ఆరోగ్యంగా ఉంటామని, ప్రతీ మూడు నెలలకోసారి రక్తదానం చేయొచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంవో జె.రవీంద్రకుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ సోఫియా, తదితరులు పాల్గొన్నారు.


రక్తదాన శిబిరం వద్ద దాతలు, వైద్యులు

ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభదాయకం

- ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ పి.షణ్ముఖరాజు

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభదాయకమని, ప్రతీ రైతు ప్రకృతి సేద్యంపై దృష్టిసారించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్(డీపీఎం) పి.షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని లఖనాపురం గ్రామంలో 10 ఎకరాల్లో చేస్తున్న నవధాన్యాల సాగును ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం, నవధాన్యాల సాగు ప్రయోజనాలను రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంభిస్తూ పంటలు పండిస్తే పెట్టుబడి ఖర్చు తగ్గడంతో పాటు ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయన్నారు. అలాగే ప్రధాన పంట సాగుకు ముందు నవధాన్యాలు నేలలో వేసుకుని మొక్కలైన తర్వాత దున్నితే నేల సారవంతమవుతుందని, తద్వారా పంటకు అవసరమైన పోషకాలు నేల ద్వారా లభ్యమవుతాయన్నారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, ఎం.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


ప్రకృతి వ్యవసాయం ప్రయోజనాలు వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయం డీపీఎం షణ్ముఖరాజు

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

భామిని: ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. జనసేన పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత తొలిసారిగా మండల కేంద్రానికి శుక్రవారం విచ్చేసిన ఆయనకు ప్రజలు, ఆ పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. అనంతరం నులకజోడు, సింగిడి గ్రామాల్లో పర్యటించిన ఆయన మాట్లాడుతూ తనను ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు. అసెంబ్లీలో నియోజకవర్గ ప్రజాసమస్యలు లేవనెత్తుతానన్నారు. పాలకొండలో డంపింగ్‌యార్డు నిర్మాణం, రైతుబజారు ఏర్పాటు, సీతంపేట, భామినిలలో బస్టాండ్‌ల ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు నిమ్మక పాండురంగ, బి.ఆనంద్, ఎం.జగదీష్, బి.రవినాయుడు, జనసేన పార్టీ నాయకులు నిమ్మల నిబ్బరం, ఆర్.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


భామినిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యంపై అప్రమత్తం


వైద్యసిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎంఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు


సిక్‌రూమ్‌లో విద్యార్థి ఆరోగ్యంపై ఆరాతీస్తున్న డీఎంఓ జగన్‌మోహన్‌రావు

సీతానగరం: వసతిగృహాల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావురావు అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని జోగింపేట గిరిజన ప్రతిభా స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (ఎస్ఓఈ) వసతి గృహాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతిగృహం గదులను పరిశీలించి దోమల నివారణకు ఏమేరకు పిచికారీ చేశారో తనిఖీ చేశారు. అనంతరం వసతిగృహం పరిసరాలను పరిశీలించి వాడుక నీరు, వర్షం నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సిక్ రూం నిర్వహణ, అక్కడ ఉన్న బెడ్స్‌కు ఏర్పాటు చేసిన దోమ తెరలను, సిక్ రిజిస్టరును పరిశీలించి వైద్య సిబ్బందికి పలుసూచనలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల వసతిగృహంలో విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బందితో పాటు పీహెచ్‌సీ అధికార సిబ్బంది ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడానికి సిద్ధంగా ఉండాలని సూచించినట్లు చెప్పారు. సిక్ రూంలో జ్వరంతో ఉన్న విద్యార్థికి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. వసతిగృహంలో జ్వరాల బారిన పడిన వారికి స్థానికంగా ప్రథమ చికిత్స చేసిన అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారికి సమాచారం అందించి, పీహెచ్‌సీకి తరలించాలన్నారు.

కొనసాగుతున్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

సీతానగరం: మండలంలోని లక్ష్మీతిరుమల లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ కర్మాగారంలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ పూజా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అగ్నిహోత్రం శ్రీనివాసాచార్యుల శిష్యబృందం పర్యవేక్షణలో రెండవ రోజూ పూజలు జరిగాయి. ఉత్సవ కమిటీ సభ్యుడు శ్రీనివాసరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్‌సీఎస్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ యాజమాన్యం ఎం.డి ఎస్.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కుటుంబసభ్యులు లోక కల్యాణార్థం ఆలయం నిర్మించినప్పటి నుంచి ఏటా ఆరు రోజుల పాటు వందలాది మంది భక్తులతో వార్షికోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలియజేశారు. ఎన్‌సీఎస్ యాజమాన్య ప్రతినిధి ఎం.సూర్యనారాయణ, కర్మాగారం ఉద్యోగులు పాల్గొన్నారు.

పశువుల్లో చర్మవ్యాధుల పరిశీలన

పార్వతీపురంటౌన్: పశువుల్లో చర్మవ్యాధుల నివారణ నిమిత్తం సంబంధిత రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టినట్లు పశుసంవర్ధక శాఖ ఎ.డిలు బి.శ్రీనివాసరావు, చక్రధర్‌లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పార్వతీపురంలోని వ్యవసాయ మార్కెట్ క్షేత్రంలో పశువులను సంబంధిత వైద్యాధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలెక్టర్ నిషాంత్ కుమార్ ఇటీవల జరిపిన సమీక్ష సమావేశంలో జారీ చేసిన ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఒడిశా ప్రాంత పశువులకు ముద్ద చర్మవ్యాధులు సోకి మృత్యువాత పడిన ఘటనలు సంభవించిన నేపథ్యంలో వారపు సంతల్లో సమీప ఒడిశా ప్రాంతం నుంచి తీసుకువస్తున్న పశువులు వచ్చి ఆంధ్ర ప్రాంతంలో కలుస్తున్న నేపథ్యంలో చర్మ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే పశువులను పరిశీలించినట్లు చెప్పారు. పరిశీలనలో చర్మవ్యాధుల పరిస్థితి కానరాలేదని ఒకవేళ వచ్చిఉంటే తీసుకోవలసిన జాగ్రత్త చర్యలపై రైతులకు అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో పశువుల రైతులు సిబ్బంది పాల్గొన్నారు.